

**చీనీ టన్ను రూ.36,500**

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36,500 పలికాయి.



**భక్తుల కొంగుబంగారం..**

ఉరవకొండ మండలం పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. 8లో

గరిష్టం/కనిష్టం

37.6°/24.2°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత బాగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షపాతం నమోదైంది.

## న్యూస్‌రీల్

### మళ్లీ నేరాల జోలికి వెళ్లొద్దు



తాడిపత్రి సబ్ జైలు తనిఖీకి వెళ్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

**తాడిపత్రి:** తాడిపత్రి సబ్ జైలును జిల్లా జడ్జి శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. జైలు పరిసరాలను పరిశీలించి, ఖైదీలతో మాట్లాడారు. చాలా మంది క్షణికావేశంలో, మరికొందరు తెలిసే నేరాలు చేస్తుంటారన్నారు. ఖైదీలు పరివర్తన చెందాలన్న ఉద్దేశంతోనే జైళ్లలో ఉంచుతామన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత మళ్లీ నేరాల జోలికి వెళ్లకుండా, మంచిగా జీవించాలని సూచించారు. జిల్లా జడ్జి వెంట తాడిపత్రి లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉద్యోగి గోపాల్‌రెడ్డి, జైలర్ కరీముల్లా, సిబ్బంది ఉన్నారు.

### నూతన ఎస్పీగా గౌతమి శాలి



**అనంతపురం:** జిల్లా నూతన ఎస్పీగా గౌతమి శాలి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గౌతమి శాలి 2015లో ఐపీఎస్ అధికారిణిగా ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని పెద్ద కన్నెలి స్వగ్రామం. ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశారు. ఐపీఎస్‌గా ఎంపిక కాక ముందు చెన్నైలోని కాగ్నిజెంట్ టెక్నాలజీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. గతంలో విశాఖపట్నం డీసీపీ–1గా, అనకాపల్లి ఎస్పీ, బొబ్బిలి ఏఎస్పీ, కర్నూలు ఏఎస్పీ (సెబ్, అడ్మినిస్ట్రేటివ్)గా విధులు నిర్వర్తించారు. ఇది వరకు ఎస్పీగా ఉన్న అమిత్ బర్దర్‌పై కేంద్ర ఎన్నికల సంఘం సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే.

### 17 మండలాల్లో వర్షం



గుత్తిలో కురిసిన వర్షం

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లాలోని 17 మండలాల పరిధిలో వర్షం పడింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు 7.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గార్లదిన్నెలో 60.0 మి.మీ, ఉరవకొండ 33.6 మి.మీ, వజ్రకరూరు 26.2 మి.మీ, అనంతపురం 15.8 మి.మీ, పామిడి 15.4 మి.మీ, పెద్దపప్పూరు 11.6 మి.మీ, కూడేరు 10 మి.మీతో పాటు నార్పల, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, శింగనమల, యాడికి, కుందుర్పి, తాడిపత్రి, కంబదూరు, బెళుగుప్ప, పెద్దవడుగూరు తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అటు శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా 16 మండలాల్లో వర్షపాతం నమోదైంది.

### కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



కౌంటింగ్ హాలులో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కోసం కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. జేఎన్‌టీయూలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ శనివారం పరిశీలించారు. బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని, ట్రాఫిక్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాట్లను చూసేందుకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వస్తుంటారని, వారి కోసం హంపీ హాస్టల్‌లో ప్రత్యేక గది ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో టీవీలు అందుబాటులో ఉంచామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో జరిగే ఏర్పాట్లను వాటి ద్వారా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

### వీఆర్వోపై వేధింపుల కేసు

**గార్లదిన్నె:** పామిడి మండలంలో వీఆర్వోగా పని చేస్తున్న అమరనాథ్‌పై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. గార్లదిన్నె మండలం కమలాపురానికి చెందిన అమరనాథ్‌కు అనంతపురానికి చెందిన రమ్యతో 2019లో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. మళ్లీ సంతాన భాగ్యం కలగలేదని, తనకు కుమారుడు కావాలని భార్యను వేధించేవాడు. రోజురోజుకూ వేధింపులు పెరిగిపోవడంతో భరించలేకపోయిన రమ్య గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రమ్య భర్త అమరనాథ్, మామ సుంకన్నపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# పెళ్లింట.. మృత్యు గంట

**వారిది చాలా పెద్ద కుటుంబం. ఆ ఇంటాయనది పెద్ద మనసు. తన తమ్ముడు చనిపోతే వారి కుటుంబాన్ని అక్కున చేర్చుకుని పోషిస్తున్నారు. పెద్ద కుమారుడు ఇటీవల చనిపోగా ఆ ఇంటి మనుషులకూ అండగా నిలబడ్డారు. పిల్లల ఆలనా పాలనా చూస్తున్నారు. ఇటీవల చిన్న కుమారుడి నిశ్చితార్థం జరిగింది. దీంతో ఆ కుటుంబమంతా ఎంతో సంతోషంలో మునిగిపోయింది. పెళ్లిని ఘనంగా చేయాలని నిశ్చయించింది. పెళ్లి పత్రికలను ఇప్పటికే చాలా మందికి పంచింది. ఎంతో ఆనందంగా 'సాగిపోతున్నాం' అనుకుంటున్న తరుణంలో వారిని వెంటాడిన మృత్యువు.. ఒక్కసారిగా అందరినీ విషాద సాగరంలోకి నెట్టేసింది. ప్రమాదంలో వరుడు కూడా చనిపోవడంతో రెండు కుటుంబాలూ, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.**

**10 రోజుల్లో నిఖా.. అంతలోనే విషాద గీతిక**

- లారీని కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతి
- మరొకరికి గాయాలు
- వరుడి మృతితో రెండు కుటుంబాల్లో శోకం
- ముక్కుపచ్చలారని పిల్లల మృత్యువాత
- కన్నీరుమున్నీరైన బంధువులు
- శోకసంద్రంలో మునిగిన బిందెలకాలనీ

**గుత్తి రూరల్:** మండలంలోని కరిడికొండ గ్రామ శివారు 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం పాలవడంతో జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. అనంతపురం నగరంలోని యల్లమ్మ వీధి బిందెల కాలనీకి చెందిన షేక్ అలీ సాహెబ్ (58) పామిడిలో గుజరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్ని రోజుల క్రితం తన తమ్ముడు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని తన దగ్గరే ఉంచుకొని ఆలనాపాలన చూస్తున్నాడు. అదే విధంగా ఈ ఏడాది జనవరి 5న పెద్ద కుమారుడు రహంతుల్లా మృతి చెందగా, అతని భార్య షేక్ జాహిదాబాను (40), ఇద్దరు కుమారులు షేక్ మహమ్మద్ ఆహిల్ (6), షేక్ మహమ్మద్ అయాన్ (3)ను తనే పోషిస్తున్నాడు. కుమారుడు, కోడలు, మనవళ్లు, తమ్ముడి కుటుంబం కలిసి 22 మంది ఒకే ఇంట్లో ఉంటున్నారు. అలీ సాహెబ్ చిన్న కుమారుడు షేక్ ఫిరోజ్‌బాషా (28) నగరంలోని ఓ బ్యాంకులో కాంట్రాక్టు ఉద్యోగిగా కొన్ని రోజుల క్రితం వరకూ పని చేసేవాడు. గుజరీ వ్యాపారం చూసుకోవాలని తండ్రి సూచించడంతో బ్యాంకు ఉద్యోగం మానేశాడు. తండ్రితో కలిసి రోజూ పామిడికి వచ్చి వ్యాపారం చూసుకుని వెళ్లేవారు.

**ఘనంగా నిశ్చితార్థం..**

తమ బంధువులకు చెందిన ఓ యువతితో ఫిరోజ్ బాషాకు వివాహం చేయాలని అలీ సాహెబ్ నిశ్చయించారు. ఈ నెల 3న నిశ్చితార్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 28న వివాహాన్ని అత్యంత వైభవంగా చేయాలని అనుకున్నారు. అందులో భాగంగానే పెళ్లి బట్టలు, ఇతర వస్తువుల కొనుగోలు కోసం రెండు రోజుల క్రితం రెండు కార్లలో



నుజ్జునుజ్జయిన కారును పరిశీలిస్తున్న పోలీసులు



కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

హైదరాబాద్ వెళ్లారు. షాపింగ్ ముగించుకున్న అనంతరం తిరుగుపయనమయ్యారు. ఒక కారులో అలీ సాహెబ్‌తో పాటు తమ్ముడి భార్య షేక్ రెహాన (44), కుమారుడు ఫిరోజ్‌బాషా, పెద్ద కోడలు షేక్ జాహిదాబాను, మనవళ్లు షేక్ మహమ్మద్ ఆహిల్, షేక్ మహమ్మద్ అయాన్ ఉండగా, మరో కారులో బంధువులు ఉన్నారు. బంధువులంతా శనివారం తెల్లవారు జాము 4 గంటలకే అనంతపురం వచ్చేశారు. అయితే, మనవళ్లు షేక్ ఆహిల్, షేక్ అయాన్ ఏడుస్తుండటంతో తాము ప్రయాణిస్తున్న కారును అలీ సాహెబ్ కర్నూలులో ఆపించారు. వారు నిద్రపోయాక ప్రయాణం ప్రారంభించారు. ఈ క్రమంలోనే గుత్తి మండలం కరిడికొండ గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ మహమ్మద్ గౌస్ నిద్ర మత్తులో తూగడంతో కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కి అవతలి వైపునకు వెళ్లి కర్నూలు వైపు వెళ్తున్న ఓ లారీని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో అలీ సాహెబ్, ఫిరోజ్, మహమ్మద్ ఆహిల్, మహమ్మద్ అయాన్‌లు ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న షేక్ రెహానను గుత్తి ఆసుపత్రికి, షేక్ జాహిదాబానును అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా వారు కూడా చికిత్స ఫలించక ప్రాణాలు విడిచారు. డ్రైవర్ గౌస్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, గుత్తి సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్ ఘటనా స్థలిని పరిశీలించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. రక్తమోడుతున్న వారి ఎస్‌ఐ తన చేతులతో బయటకు తీశారు. ఫిరోజ్‌బాషా మృతదేహం బయటకు తీసే సమయంలో తల తెగి కింద పడిపోగా ఎస్‌ఐ తీసుకొచ్చి అంబులెన్సు సిబ్బందికి అందించారు. ఎస్‌ఐ చొరవను పలువురు అభినందించారు.





అనంతపురంలో మృతుల ఇంటి వద్ద కన్నీరుమున్నీరవుతున్న బంధువులు, మృతుల ఇంటి వద్ద గుమిగూడిన బంధువులు, స్థానికులు

**ప్రమాదంలో మృతి చెందిన వారు**



షేక్ అలీ సాహెబ్, షేక్ రెహాన, షేక్ జాహిదాబాను (ఫైల్)



పెళ్లి కుమారుడు షేక్ ఫిరోజ్‌తో షేక్ మహమ్మద్ ఆహిల్, షేక్ మహమ్మద్ అయాన్ (ఫైల్)

**బిందెల కాలనీ కన్నీటి సంద్రం..**

తమ కాలనీకి చెందిన ఆరుగురు మృతి చెందారనే వార్తతో బిందెలకాలనీ విషాదంలో మునిగిపోయింది. మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు గుండెలవిసేలా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూకాలేదు. తమ వెనకే వస్తారనుకున్న వారు ఎంతసేపటికీ తిరిగిరాకపోవడం, ఆ క్రమంలోనే మరణవార్త తెలియడంతో కారులో ముందు వచ్చిన వారంతా ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

**కుటుంబం మొత్తం మృతి..**

అలీసాహెబ్ పెద్ద కుమారుడు రహంతుల్లా ఈ ఏడాది జనవరిలో మరణించగా, శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రహంతుల్లా భార్యతో పాటు ఇద్దరు కుమారులు మరణించారు. ఇక.. అలీ సాహెబ్ భార్య గతంలోనే మృతి చెందగా, ఇప్పుడు చిన్న కుమారుడు, అలీ సాహెబ్ కూడా ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది.

**మారాం చేసి.. మరణించి..**

షాపింగ్ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్తున్న మరిదికి, మామకు బాయ్ చెబుదామని జాహిదా కారు వద్దకు వచ్చారు. ఈ క్రమంలోనే ఆమె వెంట వచ్చిన కుమారులిద్దరూ తామూ వెళ్తామని మారాం చేయడంతో కాదనలేక పిల్లలతో కలిసి జాహిదా కారులో వెళ్లారు. ప్రమాదంలో ప్రాణాలు వదిలారు. ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లలను కూడా మృత్యువు కబళించింది.

**సోదరుడి కుమారుడి దత్తత..**

తన సోదరుడు కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందగా, అతడి కుమారుడైన గౌస్‌ను అలీసాహెబ్ దత్తత తీసుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారును నడుపుతున్న గౌస్ కూడా గాయపడ్డారు.

# అన్నదాతలకు ప్రేమతో..

**రూ.356 కోట్ల 'ఇన్‌పుట్ సబ్సిడీ' విడుదల**

- రైతుల ఖాతాల్లో జమవుతున్నట్లు అధికారుల వెల్లడి
- ఈ ఐదేళ్లలో ఇన్‌పుట్ కింద 'అనంత' రైతులకు రూ.486 కోట్లు
- సీజన్ ముగిసేలోపు రైతు ఖాతాకు ఠంచన్‌గా పెట్టుబడి రాయితీ
- చంద్రబాబు కుట్రతో లేటుగా 'ఇన్‌పుట్'

**అనంతపురం అగ్రికల్చర్:** ఎన్నికలకు ముందుగానే రైతుల ఖాతాల్లోకి జమ కావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడిరాయితీ) ఎట్టకేలకు శనివారం విడుదల చేశారు. రూ.356 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందివ్వాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా ముందుచూపుతో వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ వస్తుందని సంక్షేమ కేలెండర్‌కు కాస్త ముందుగానే బటన్ నొక్కి సాంకేతిక పరంగా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అయితే రైతులకు ఇన్‌పుట్ విడుదల కాకుండా టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు కుట్ర పన్నడంతో ప్రక్రియ ఆగిపోయింది. పోలింగ్ ముగియడంతో తాజాగా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారు.

**2.86 లక్షల మందికి..**

2023 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధిలో 47 మండలాలను కరువు జాబితాలో చేర్చిన నేపథ్యంలో ఇన్‌పుట్ మంజూరైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2.86 లక్షల మంది రైతుల ఖాతాల్లో పరిహారం నగదు జమ కావడం ప్రారంభమైందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 1,9,970 మంది రైతులకు రూ.251.20 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 1,17,005 మంది రైతులకు రూ.105.03 కోట్లు జమ కానుందని పేర్కొన్నారు.

**నాలుగేళ్లూ కరువు తీరేలా వర్షాలు..**

వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి నాలుగేళ్లు కరువు తీరేలా వర్షాలు కురిశాయి. గతేడాది మాత్రం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అతివృష్టి అయినా, అనావృష్టి సంభవించినా రైతులకు చేయాల్సిన సాయంలో ఎన్నడూ జగన్ సర్కారు వెనుకడుగు వేయలేదు. రైతులు ఇబ్బంది పడకుండా అనుకున్న సమయానికి ఠంచన్‌గా పరిహారం అందజేస్తున్నారు. రైతు



భరోసా–పీఎం కిసాన్, వైఎస్సార్ ఉచిత పంటల బీమాతో ఓ వైపు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. మరోవైపు పంటలు కోల్పోయిన రైతులకు కూడా పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించి ఆదుకున్నారు. అది కూడా సీజన్ ముగిసేలోపు ఆర్థిక సాయం అందించడం గమనార్హం. 2021, 2022లో కుండపోత వర్షాల కారణంగా అక్కడక్కడా వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. ఇక 2023లో వర్షాలు లేక పంటలు దెబ్బతినడంతో రైతులకు నష్టం వాటిల్లకుండా ఇన్‌పుట్‌తో ఆదుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి 40,00,637 మంది రైతులకు ఏకంగా రూ.485.94 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు. అందులో అనంతపురం జిల్లాలో 2,65,290 మంది రైతులకు రూ.364.85 కోట్లు, 'శ్రీసత్యసాయి'లో 1,35,347 మంది రైతులకు రూ.121.08 కోట్లు అందించారు.

# పకడ్బందీగా పరీక్షలు



- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయండి
- చిత్తశుద్ధితో పనిచేసి అక్షరాస్యత శాతం పెంచాలి
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- ఏపీఓఎస్ఎస్, డీఈఈసెట్, ఇంటర్ పరీక్షలపై సమీక్ష

**అనంతపురం అర్బన్:** "త్వరలో జరగనున్న డీఈఈసెట్, ఎస్ఎస్‌ఈ అడ్వాన్స్ సప్లిమెంటర్, ఏపీఓఎస్ఎస్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి" అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాపీయింగ్ జరిగితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్), ఎస్ఎస్‌ఈ, ఇంటర్ పరీక్షలు జూన్ 1 నుంచి 8 వరకు జరగనున్నాయన్నారు. రెండు కేంద్రాల్లో జరగనున్న ఎస్ఎస్‌ఈ పరీక్షకు 427 మంది విద్యార్థులు, ఐదు కేంద్రాల్లో జరగనున్న ఇంటర్ పరీక్షకు 964 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12 వరకు జరుగుతాయన్నారు. మూడు కేంద్రాల్లో జరగనున్న ప్రాక్టికల్స్‌కు 379 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆయన ఆదేశించారు.

**24 నుంచి ఎస్ఎస్‌ఈ సప్లిమెంటరీ..**

ఎస్ఎస్‌ఈ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరగనున్నాయన్నారు. జిలావ్యాప్తంగా 45 కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 13,332 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

**24న డీఈఈ సెట్**

డీఈఈసెట్–2024 ఈనెల 24 జరగనుందని కలెక్టర్ తెలిపారు. ఒక కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షకు 34 మంది విద్యార్థులు, నలుగురు దివ్యాంగ విద్యార్థులు హాజరవుతారన్నారు.

**టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు..**

జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు జిల్లా ఎడ్యుకేషన్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇందులో జిల్లా, రాష్ట్రస్థాయి నిపుణులు ఉండాలన్నారు. 10వ తరగతి, ఇతర పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. చదువుతోనే మంచి భవిష్యత్తు సాధ్యమని, ఈ దిశగా ప్రేరణ కలిగించేలా విద్యార్థులకు విద్యను ఉపాధ్యాయులు బోధించాలన్నారు. రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు, సాంస్కృతిక, వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీల్లో జిల్లా విద్యార్థులు పాల్గొనేలా చూడాలని చెప్పారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన ప్రతి విద్యార్థిని ఒక ఉపాధ్యాయునికి మ్యాపింగ్ చేయాలని చెప్పారు. 8వ తరగతి నుంచి విద్యార్థులకు నైపుణాభివృద్ధి శిక్షణ ప్రారంభించాలన్నారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఇందు కోసం దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఈఓ వరలక్ష్మి, ప్రభుత్వ ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డీఎంహెచ్‌ఓ ఈ.భ్రమరాంబదేవి. ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో అదుపులోకి శాంతిభద్రతలు



తాడిపత్రి పోలీసులతో మాట్లాడుతున్న 'సిట్' అధికారులు

- పట్టణంలోనే డీఐజీ షిమోషి మకాం
- రంగంలోకి ఆర్‌పీఎఫ్ బలగాలు

**తాడిపత్రి/అర్బన్:** తాడిపత్రిలో శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయి. పోలింగ్ అనంతరం వరుస అల్లర్ల నేపథ్యంలో అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి వాజ్‌పేయి పట్టణంలోనే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పోలీసు బలగాలు పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ప్రధాన కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. నందలపాడు, శ్రీనివాసపురం, పప్పూరు రోడ్డు, మెయిన్‌బజార్, చిన్నబజార్, సీబీ రోడ్డు, టైలర్స్‌కాలనీ, శివాలయం వీధి, నంద్యాల రోడ్డు, గానుగవీధి, సంజీవనగర్, భగత్‌సింగ్ నగర్‌లో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

**ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు రాక..**

తాడిపత్రిలో అల్లర్లను అదుపులోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం పట్టణానికి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు (ఆర్‌పీఎఫ్) బలగాలను రప్పించారు. ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు.

**తాడిపత్రి చేరుకున్న సిట్ అధికారుల బృందం**

పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లకు సంబంధించి విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన సిట్ బృందం శనివారం రాత్రి పట్టణానికి చేరుకుంది. డీఎస్పీ శ్రీనివాస రావు నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కూడిన బృందం ముందుగా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో డీఐజీ షిమోషితో భేటీ అయ్యారు. అనంతరం సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ గౌస్‌బాషాతో కలిసి పోలింగ్ రోజు అల్లర్లు జరిగిన ఓంశాంతి నగర్‌ను పరిశీలించారు. గానుగవీధిలో టీడీపీ నాయకుడి ఇంటి పరిసరాలను పరిశీలించిన అనంతరం నేరుగా జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసంపై రాళ్లు రువ్విన తీరును స్థానిక పోలీసుల నుంచి తెలుసుకున్నారు. డీఎస్పీ కార్యాలయంలో సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణతో భేటీ అయ్యారు. సిట్ బృంద సభ్యులు మీడియాతో మాట్లాడటానికి నిరాకరించారు.

## క్లుప్తంగా

### పీఏబీఆర్‌లో తగ్గిన నీటిమట్టం



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. జలాశంలో ఏర్పాటు చేసిన అనంత, సత్యసాయి, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు సుమారు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలోకి ఇన్‌ఫ్లో లేదు. వర్షాలు బాగా కురిస్తే వరద నీటి రూపంలో డ్యాంలోకి నీరు వచ్చి చేరే అవకాశం ఉంది. శనివారం నాటికి డ్యాంలో 1.04 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జేఈ లక్ష్మీదేవి తెలిపారు.

### రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



బాబు (ఫైల్)

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో బ్రిడ్జి వద్ద బాబు (37) అనే వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. గుత్తిలోని వైఎస్సార్ కాలనీలో నివాసముండే బాబు తాగుడుకు బానిసయ్యాడు. ఏ పనీ చేసేవాడు కాదు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల అన్ని ప్రాంతాలు గాలించినా జాడ కనపడలేదు. శనివారం రైలుకింద పడి చనిపోయినట్లు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. బాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప కేసు నమోదు చేశారు.

### సవారమ్మ ఆలయంలో చోరీ

కుందుర్పి: బెస్తరపల్లి సవారమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు హుండీలో ఉన్న దాదాపు రూ.లక్ష నగదుతో పాటు రూ.2 లక్షల విలువైన వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. పూజారి సూరి శనివారం ఉదయం ఆలయానికి రాగానే.. అప్పటికే తలుపులు తెరిచి ఉండడం చూసి లోనికెళ్లి పరిశీలించాడు. హుండీ కనిపించలేదు. దొంగలు ఎత్తుకుపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వెంకటస్వామి కేసు నమోదు చేశారు.

# అధికారుల పచ్చపాతం

- 'పది' స్పాట్ రెమ్యునరేషన్‌పై ధన్యవాదాలు తెలిపిన టీచర్ల సంఘ నేత సస్పెన్షన్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ పత్రికలకు ఎక్కిన వారిపై చర్యలు నిల్
- టీడీపీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న టీచర్లనూ పట్టించుకోని అధికారులు
- ఆధారాలతో సహా ఫిర్యాదులందినా వెనకేసుకొస్తున్న వైనం
- విద్యాశాఖలో కీలక అధికారి నిర్వాకం
- ఒక వర్గాన్నే లక్ష్యంగా చేసుకుని చర్యలు!



కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుతో టీచర్లు రాఘవేంద్రగుప్తా, వై.మంజునాథ్ (ఫైల్)



ధర్మవరం ఫెసిలిటేషన్ కేంద్రంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ హల్‌చల్ (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల నియమావళిని పారదర్శకంగా అమలు చేయాల్సిన ఉమ్మడి జిల్లాలోని పలువురు విద్యాశాఖ అధికారులు 'పచ్చ' పాతం ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడారని, పోస్టల్ బ్యాలెట్ల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, టీడీపీకి మద్దతుగా బహిరంగ ప్రచారం చేసినట్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు తీసుకోని అధికారులు 'ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే' అన్న ఓ టీచరుపై మాత్రం సస్పెన్షన్ వేటు వేశారు. అనంతపురం జిల్లా విద్యాశాఖలోని ఓ కీలక అధికారి ఒక వర్గాన్నే లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

**రెమ్యునరేషన్ పెంచడం సంతోషం అన్నందుకు సస్పెన్షన్**

ఎప్పుడూ లేనివిధంగా పదోతరగతి స్పాట్ రెమ్యునరేషన్ పెంచుతూ గతేడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మార్చి 23న 'సాక్షి'లో 'పది స్పాట్ రెమ్యునరేషన్ భారీగా పెంపు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. పదేళ్ల తర్వాత అన్ని కేడర్ల ఉద్యోగులకూ రెమ్యునరేషన్ పెంచడం సంతోషదాయకమని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొనగా.. నెల తర్వాత దీనిపై గుర్తు తెలియని వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే నోటీసు ఇవ్వకుండా, కనీసం విచారణ చేయకుండా ఏప్రిల్ 29న పి.అశోక్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి రెమ్యునరేషన్ వివరాలను డీఈఓ వరలక్ష్మీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ కూడా వెల్లడించినట్లు ఇదే కథనంలో ఉంది. టీచరు అశోక్‌కుమార్‌రెడ్డికి వర్తించిన నిబంధన ఈ ఇద్దరు అధికారులకు వర్తించవా.. అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టీచరుకో న్యాయం? అధికారులకో న్యాయమా? అనే చర్చ జరుగుతోంది.

**టీడీపీకి మద్దతుగా ప్రచారం చేసినా... చర్యల్లేవ్!**

కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న రాఘవేంద్రగుప్తా, నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న వై.మంజునాథ్‌లు టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇలా టీడీపీకి కొమ్ముకాస్తున్న వీరి ద్వారా బ్రహ్మసముద్రం ఎంఈఓ పోస్టల్ బ్యాలెట్ ఆర్డర్ కాపీలను టీచర్లకు పంపిణీ చేశారు. వాస్తవంగా ఈ కాపీలను నేరుగా ఆయా టీచర్లకు అందజేయాల్సి ఉన్నా, ఎంఈఓ నిబంధనలు ఉల్లంఘించారు. దీనిపై పలువురు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా.. అశోక్‌కుమార్ రెడ్డి విషయంలో ఎలాగైతే చర్యలు తీసుకున్నారో.. ఆ విధంగానే ఈ ముగ్గురిపైనా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. కమిషన్ ఆదేశానుసారం చర్యలకు ఉపక్రమిస్తూ ఫైలును సిద్ధం చేయగా, చివరి నిమిషంలో ఓ కీలక అధికారి అడ్డుపడినట్లు తెలిసింది. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద ఓ వర్గం టీచర్లు, సంఘాల నాయకులు కనిపిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలంటూ సదరు అధికారి కొందరికి ఆదేశాలిచ్చినట్లు కూడా సమాచారం.

- ఇక శ్రీసత్యసాయి జిల్లాలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు చంద్రశేఖర్, రామ్మోహన్, హరిప్రసాద్‌రెడ్డి ఓ పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేసినా వారిపై కనీస చర్యలు తీసుకోలేదు.
- ధర్మవరం నియోజకవర్గంలో ఓటరు కానప్పటికీ అక్కడి ఫెసిలిటేషన్ కేంద్రానికి వెళ్లిన ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోకుకుమార్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రభావితం చేస్తూ హల్‌చల్ చేశాడు. బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌కు అనుకూలంగా ఓట్లు వేయాలంటూ బహిరంగంగానే ప్రచారం చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈయనపై కూడా చర్యలు తీసుకోలేదంటే విద్యాశాఖలోని పలువురు అధికారులు ఎంతగా 'పచ్చ' పాతం ప్రదర్శించారో అర్థమవుతుంది.

### కూలిన వెంచర్ ముఖద్వారం

- ఇద్దరు కూలీలు దుర్మరణం



మృతి చెందిన కూలీలు పురంసింగ్, హోషా సింగ్

కూడేరు: వెంచర్ ముఖద్వార నిర్మాణ సమయంలో అపశ్రుతి చోటు చేసుకుంది. వెంచర్ దిమ్మె కుప్పకూలడంతో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు కూలీలు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గొటుకూరు వద్ద అనంతపురం – బళ్లారి ప్రధాన రహదారి పక్కనే భవ్యశ్రీ పేరిట వెంచర్ వేస్తున్నారు. వెంచర్‌కు ముఖ ద్వార నిర్మాణం చేపట్టారు. ఇరువైపులా పిల్లర్లు వేసి దానిని అనుసంధానిస్తూ స్లాబ్ పనులు శనివారం చేస్తున్నారు. పైభాగంలో నిల్చుని వైబ్రేటర్ పెడుతున్న సమయంలో స్లాబ్ కూలింది. దీంతో ఓ వైపున ఉన్న పిల్లర్లు సైతం విరిగిపడ్డాయి. పైభాగన పనిచేస్తున్న మధ్యప్రదేశ్ కూలీలు పురంసింగ్ (27), హోషాసింగ్ (26) కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. తిహార్ అనే మరో కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. కిందివైపున ఉన్న బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడుకు చెందిన కూలీలు ఆంజనేయులు, నాగరాజు సైతం గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా భవ్యశ్రీ వెంచర్‌కు ఎలాంటి అనుమతులూ లేవని సమాచారం.

### డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (విజయవాడ)లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్ శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి విద్యార్హతతో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ విద్యార్హతతో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ పెరాస్సింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు cipet24.onlineregistrationfor.org వెబ్‌సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కూడా కల్పించిందని వివరించారు. మరిన్ని వివరాలకు 63001 47965 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### గ్రూప్-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం రూరల్: ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ పొందేందుకు ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం బీసీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకులు కుష్బూకొఠారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 23 నుంచి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం లక్ష రూపాయల వరకు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రిలిమినరీ పరీక్షల హాల్ టికెట్‌తో పాటు బయోడేటా, పదో తరగతి మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జతచేసి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

### 'సెంట్రల్' వర్సిటీ కోర్సులపై ఆరా



క్యాంపస్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖ కార్యదర్శి

అనంతపురం: జంతలూరు వద్దనున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ క్యాంపస్‌ను శనివారం కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కె.సంజయ్‌మూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఎస్‌ఏ కోరి ప్రొఫెసర్లను పరిచయం చేశారు. అనంతరం క్యాంపస్‌లో మొక్కలు నాటారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి క్యాంపస్‌లో నిర్వహించే కోర్సులపై ఆరా తీశారు.

## ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న అబ్దుల్లా

గుంతకల్లు టౌన్: జన సమ్మర్దనం కలిగిన ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టపగలే ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం జరిగింది. సంచలనం రేపిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డు ఏరియాలో నివసిస్తున్న ఆటోడ్రైవర్ అబ్దుల్లా (30), సల్మా దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. కొద్దిరోజుల క్రితం అబ్దుల్లా, ఇదే ఏరియాకు చెందిన టిప్పర్‌డ్రైవర్ సికిందర్ అలియాస్ చాంద్‌బాషా మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి కక్ష పెంచుకున్న చాంద్‌బాషా అదును కోసం వేచి చూశాడు. శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ వద్ద ఆటోస్టాండ్‌లో కూర్చున్న అబ్దుల్లాపై చాంద్‌బాషా కత్తితో విరుచుకుపడ్డాడు. విచక్షణారహితంగా పొడవడంతో అబ్దుల్లా కడుపులోని పేగులు బయటపడ్డాయి. స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో చాంద్‌బాషా అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న అబ్దుల్లాను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అబ్దుల్లా తండ్రి వన్నూరప్ప ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ గణేష్ తెలిపారు. కాగా నిందితుడు టూటౌన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్యాయత్నం జరిగినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## ప్రయాణిస్తూనే.. ప్రాణాలొదిలాడు

- బెంగళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే రైలులో ఘటన



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనంతపురం సిటీ: బెంగళూరు నుంచి గుల్బర్గాకు రైలులో బయల్దేరిన ప్రయాణికుడు గమ్యస్థానం చేరకనే మృత్యు ఒడికి చేరాడు. అనంతపురం జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే కేకే ఎక్స్‌ప్రెస్ రైలులోని జనరల్ బోగీలో ఓ వ్యక్తి (40) ప్రయాణిస్తున్నాడు. రైలు అనంతపురం సమీపంలోకి వచ్చే సరికి ఆ వ్యక్తిలో ఎటువంటి కదలికలూ లేకపోవడాన్ని తోటి ప్రయాణికులు గమనించి రైలు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు జీఆర్‌పీ పోలీసులకు తెలియజేశారు. రైలు అనంతపురం స్టేషన్ చేరుకోగానే జనరల్ బోగీని పరిశీలించిన పోలీసులు నిర్జీవంగా పడి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని భద్రపరిచారు. మృతుని జేబులో బెంగళూరు – గుల్బర్గా జనరల్ టికెట్ లభించింది. ఇతర ఏ ఆధారమూ దొరకలేదని ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. దీన్ని బట్టి చూస్తే మృతుడు గుల్బర్గా ప్రాంతానికి చెంది ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. ఇది సహజ మరణమేనని ఆయన పేర్కొన్నారు. మృతుడు మెరూన్ రెడ్ టీ షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని కర్ణాటక రాష్ట్ర పోలీసులకు సమాచారం అందించామని వివరించారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే 85002 38200 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

## గురుకులాల్లో ఇంటర్ మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకులాల సమన్వయ అధికారి అంగడి మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఏజీ సెట్–2024లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందని పేర్కొన్నారు. బాలుర గురుకులాల్లోని 154 ఖాళీలు, బాలికల గురుకులాల్లోని 295 ఖాళీల భర్తీకి 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలురకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 22 నుంచి 7,569 ర్యాంకు వరకు, ఎస్టీ 261 నుంచి 5,730, బీసీ 5 నుంచి 403, ఓసీ కేటగిరీలో 19 నుంచి 1023 ర్యాంకు వరకు విద్యార్థులకు ఈ నెల 22న నార్పల మండలం బి.పప్పూరు గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

- బాలికలకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 57 నుంచి 19,371 ర్యాంకు వరకు, బీసీసీ కేటగిరీలో 425 నుంచి 18,483 వరకు, ఎస్టీ 48 నుంచి 12,867, బీసీ 14 నుంచి 1,845, ఓసీ కేటగిరీలో 11 నుంచి 2,128 ర్యాంకు వరకు ఈ నెల 23న అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం తొమ్మిది గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. మెరిట్ కార్డు, టెన్త్ మార్కుల మెమో, ఆధార్ కార్డు, కులం, ఆదాయ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

## సాఫ్ట్‌బాల్‌లో ఎస్కేయూకు బంగారు పతకం



ప్రతిభ చాటిన ఎస్కేయూ సాఫ్ట్‌బాల్ జట్టు

అనంతపురం: అఖిల భారత అంతర్ వర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) జట్టు ప్రతిభచాటి బంగారు పతకం దక్కించుకుంది. 43 సంవత్సరాల యూనివర్సిటీ చరిత్రలో తొలి సారి బంగారు పతకం సాధించడం విశేషం. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు బెంగళూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో సౌందర్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఈ టోర్నీ నిర్వహించారు. ఇందులో దేశ వ్యాప్తంగా 90 జట్లు పాల్గొన్నాయి. ఈ జట్టుకు కోచ్‌గా ఎస్కేయూ క్యాంపస్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్ వ్యవహరించారు. బంగారు పతకం సాధించిన జట్టు సభ్యులను ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి, యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ ఎంపీ శ్రీనివాసన్ అభినందించారు. టోర్నీలో ఉత్తమ పిక్చర్‌గా షేక్ చిన్న మస్తాన్, బెస్ట్ బ్యాటర్‌గా బి. రాంబాబులకు అవార్డులు వరించాయి.

## భక్తుల కొంగుబంగారం లక్ష్మీనృసింహుడు

- రేపటి నుంచి పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు
- 28న బ్రహ్మ రథోత్సవం





లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్, బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన పెన్నహోబిల పుణ్యక్షేత్రం

ఉరవకొండ: భక్తుల కొంగుబంగారంగా పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి విశేష పూజలదుకుంటున్నారు. ఇక్కడి పచ్చదనం – జలపాతం చూపరులను ఆకట్టుకుంది. పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధి గాంచి, భక్తులకు ఆహ్లాదం, మనశ్శాంతి, భక్తి భావాలు పంచుతోంది. రేపటి నుంచి లక్ష్మీనారసింహుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. 20వ తేదీ ఆమిద్యాల నుంచి శ్రీవారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెన్నహోబిలం తీసుకొస్తారు. 21న ధ్వజారోహణం, 22న సింహ వాహనం, చంద్రప్రభ వాహనం, 23న గోవాహనం, శేషవాహనం, 24న హంస వాహనం, 25న హనమద్ వాహన ఉత్సవాలు నిర్వహిస్తారు. 26న గరుడ వాహనోత్సవం అనంతరం శ్రీవారి కల్యాణోత్సవం ఉంటుంది. 27న ఐరావత వాహనోత్సవం, 28న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం, 29న అశ్వవాహనోత్సవం, 30న ధ్వజారోహణం, శయనోత్సవం, 31న ఉత్సవమూర్తులను ఆమిద్యాలకు చేర్చటంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**పాత రథానికి మరమ్మతులు..**

గత ఏడాది ఏప్రిల్ 29న శ్రీవారి రథం మరమ్మతుల సమయంలో క్రేన్ పట్టుతప్పడంతో రథం ధ్వంసమైంది. పాత రథం స్థానంలో కొత్త రథం తయారీ పనులు జరుగుతున్నాయి. పూర్తయ్యేందుకు మరికొంత సమయం పట్టనుండటంతో ఈసారి బ్రహ్మోత్సవాలకు పాత రథమే వినియోగించనున్నారు. ఈ మేరకు ఈఓ విజయకుమార్ పర్యవేక్షణలో పాత రథం మరమ్మతులు చేయించారు.

**చురుగ్గా ఏర్పాట్లు**

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు తాగునీరు, భోజన వసతి కల్పిస్తున్నాం. చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు మరుగుదొడ్లు కూడా అందుబాటులోకి తెచ్చాం. అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తాం.

– కె.విజయ్‌కుమార్ ఈఓ, పెన్నహోబిలం

## క్లుప్తంగా

### నిముషాంబా దేవికి పూజలు


పూజలందుకున్న నిముషాంబా దేవి

అనంతపురం కల్చరల్: భక్తుల కొంగు బంగారంగా భాసిల్లుతున్న నిముషాంబా దేవి జయంతి శనివారం నేత్రపర్వంగా సాగింది. స్థానిక చెరువుకట్టపై వెలసిన అమ్మవారి ఆలయంలో ఉదయం అమ్మవారిని వివిధ ఫలాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయంలో గణపతి, నవగ్రహ పూజలు, చండీ హోమాలను రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం అమ్మవారిని పూలరథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. తాడేపల్లిగూడెం నుంచి విచ్చేసిన శ్రీకాళీమాత డ్యాన్స్ బృందాలు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ప్రతినిధి రమేష్ నేతృత్వంలో అమ్మవారికి ఊంజల సేవ, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ జరిగాయి.

### హీరో శ్రీకాంత్ నేటి పర్యటన వాయిదా



అనంతపురం ఎడ్యుకేషన్: హీరో శ్రీకాంత్ ఆదివారం అనంతపురం నగర పర్యటన వాయిదా పడింది. నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రేయాస్ గ్రాండ్ హోటల్‌ను హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగాల్సి ఉంది. అయితే ఎన్నికల నియమావళి, 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసుల అనుమతి లభించలేదు. ఈ కారణంగా శ్రీకాంత్ పర్యటన వాయిదా పడినట్లు శ్రేయాస్ హోటల్ నిర్వాహకుడు, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

### అర్హత కలిగిన ప్రతి రైతుకూ విత్తనం

అనంతపురం అగ్రికల్చర్: అర్హత కలిగిన ప్రతి రైతుకూ రాయితీ విత్తనం అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి ఆదేశించారు. శనివారం స్థానిక డివిజన్ కార్యాలయంలో అనంతపురం, రాప్తాడు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, ఆత్మకూరు, కూడేరు మండలాల ఏఓలు, ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఏపీ సీడ్స్ ద్వారా ఆర్‌బీకేలకు నాణ్యమైన విత్తనం అందేలా పర్యవేక్షించాలన్నారు. వెంటనేరిజిస్ట్రేషన్లు చేపట్టాలన్నారు. ప్రస్తుతానికి డివిజన్‌కు 14,400 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారని.. అయితే బీకేఎస్, కూడేరు, ఆత్మకూరు, గార్లదిన్నె మండలాలకు అదనంగా 2 వేల క్వింటాళ్లు తెప్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తన పంపిణీలో ఎస్సీ ఎస్టీ కౌలు రైతులు, చిన్న సన్నకారు రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 40 శాతం రాయితీ పోనూ రైతుల నుంచి వారి వాటా కట్టిన రైతులకు ఈనెల 24 నుంచి విత్తనకాయలు అందేలా చూడాలన్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్ మెన్యూర్స్) అవసరమైన రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఆర్‌బీకే అసిస్టెంట్లను అప్రమత్తం చేసి ఎక్కడా ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా విత్తన పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఏఓలు శశికళ, శేఖర్‌రెడ్డి, శ్యాంసుందరరెడ్డి, పి.సోమశేఖర్, సుచరిత, విజయకుమార్, ఏఈవోలు మురళి, సుజిత పాల్గొన్నారు.

**వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి..**

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌కు సంభందించి సబ్సిడి విత్తన వేరుశనగకు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

కనగానపల్లి: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం స్థానిక ఆర్‌బీకేల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏడీఏ కిష్టయ్య శనివారం సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది కూడా కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఉండి రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలన్నారు.






నృత్యం చేస్తున్న మహిళలు


వాసవీమాతను రథంలో ఊరేగిస్తున్న దృశ్యం

# కరుణించు.. వాసవీమాత

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం ప్రత్యేక పూజలు, నగరోత్సవాలు, ఊంజల సేవలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం కిటకిటలాడింది. భారీ ఎత్తున తరలి వచ్చిన భక్తజన సందోహంతో పాతూరు వీధులు జనసంద్రాలుగా మారాయి. కన్యలు అమ్మవారి కలశాలతో వాసవీమాత నామస్మరణ చేశారు. అనంతరం వాసవీ హోమం, అలంకార సేవలు, తీర్థప్రసాద వితరణ పెద్ద ఎత్తున జరిగాయి. సాయంత్రం సాగిన సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. అలాగే కొత్తూరు అమ్మవారి శాల ఆధ్వర్యంలో శోభాయమానంగా అలంకరించిన పూల తేరుపై అమ్మవారిని కొలువుదీర్చారు. రాజు రోడ్డు మీదుగా ఆర్యవైశ్య హాస్టల్ వరకూ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని కీర్తించే భజన బృందాలు ముందు నడుస్తుండగా మంగళవాయిద్యాల నడుమ వాసవీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది మహిళలు ఏకరూప వస్త్రధారణతో కలశాలు, పూర్ణకుంభాలను తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. రుత్వికులు వాసవీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం, అన్నవితరణ జరిగాయి. రాత్రి ఊంజల సేవ ఘనంగా జరిగింది.


ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత


కొత్తూరులో వాసవీమాతకు పూజలు

**ఆత్మకూరు:** మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీమాత జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలోని వాసవీ మాత విగ్రహానిన్ని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**చెన్నేకొత్తపల్లి:** మండల కేంద్రంలో వాసవీమాత జయంతిని ఆర్యవైశ్యులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్యవైశ్య సత్రంలో వాసవీమాత విగ్రహానికి అభిషేకం చేసి, ప్రత్యేంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలోని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.


పాతూరులో కలశాల ఊరేగింపు


కొత్తూరులో కలశాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


చెన్నేకొత్తపల్లి: వాసవీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

# వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు


కనగానపల్లి: బ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేస్తున్న ఆశ్రమ పీఠాధిపతి


రాప్తాడు: పూజల్లో పాల్గొన్న భక్తులు


అనంతపురం కల్చరల్: పూజలందుకున్న వీరబ్రహ్మేంద్రులు

అనంతపురం కల్చరల్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా ఉత్సవాలు శనివారం కన్నుల పండవగా జరిగాయి. స్థానిక రాణినగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు. అలంకార సేవలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన పూలతేరుపై వీరబ్రహ్మేంద్రుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ప్రత్యేకంగా తరలి వచ్చిన భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, రాజస్థానీ షేర్ డ్రమ్స్ హోరు నడుమ పురవీధుల్లో తిరుగాడిన రథానికి భక్తులు భక్తి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు గురుప్రసాద్, సంఘం సభ్యులు రంగాచారి, ప్రకాష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

**మౌనగిరి క్షేత్రంలో..**

రాప్తాడు: హంపాపురం సమీపంలోని మౌనగిరి క్షేత్రంలో 39 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. శనివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి ఆలయ వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆరాధన మహోత్సవానికి మండలంలోని హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.,చెర్లోపల్లి, ఎం.బండమీదపల్లి, రామినేపల్లి, గొందిరెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, లింగనపల్లి, బోమ్మేపర్తి, పుల్లలరేవు తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

**పాతపాళ్యం గ్రామంలో..**

కనగానపల్లి: మండలంలోని పాతపాళ్యం గ్రామంలో శనివారం పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి ఆరాధనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారి ఆలయ ఆశ్రమంలో భక్తులు తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు చేశారు.స్థానిక ఆశ్రమ పీఠాధిపతి రామయ్య స్వామి బ్రహ్మంగారి కాలజ్ఞానం, జీవ సమాధి గురించి ప్రజలకు తెలియజేశారు. ఇక సాయంత్రం గ్రామంలో బ్రహ్మంగారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గోవిందురెడ్డి, మనోహర. సన్నప్పయ్య, శీనప్ప, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఈఏపీసెట్‌లో 'అనంత' విద్యార్థి సత్తా

- 6వ ర్యాంకు సాధించిన పుట్టి కుషాల్‌కుమార్


పుట్టి కుషాల్ కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: తెలంగాణ రాష్ట్ర ఈఏపీసెట్ ఫలితాల్లో 'అనంత' విద్యార్థి సత్తా చాటాడు. అనంతపురానికి చెందిన పుట్టి కుషాల్‌కుమార్ రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. ఆర్కే నగర్‌లో నివాసం ఉంటున్న పుట్టి నాగేంద్ర, పుట్టి మణిమాల దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. నాగేంద్ర సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, మణిమాల గృహిణి. వీరి పెద్ద కుమారుడు పుట్టి హేమంత్ ఎయిమ్స్ భోపాల్‌లో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చిన్నకుమారుడు పుట్టి కుషాల్‌కుమార్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివాడు. పదో తరగతి గుడివాడ కేకేఆర్ గౌతం పాఠశాలలో చదివాడు. తెలంగాణ ఈఏపీసెట్‌లో 142.825195 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 6వ స్థానంలో నిలిచాడు. కుషాల్‌కుమార్ జేఈఈ మెయిన్స్‌లో 120వ ర్యాంకు సాధించాడు. ఐఐటీ ముంబైలో సీటు సాధించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

### అద్భుతమైన చరిత్ర 'అనంత' సొంతం


మాట్లాడుతున్న పురావస్తు శాఖ ఏడీ రజిత

అనంతపురం కల్చరల్: జిల్లాలోని చారిత్రాత్మక వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురావస్తు శాఖ ఏడీ రజిత అన్నారు. శనివారం స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తుశాఖ కార్యాలయంలో మ్యూజియం దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మ్యూజియంలోని వస్తువులను తిలకించారు. ఏడీ రజిత విద్యార్థులకు అనంత చరిత్ర పరిణామాన్ని, వివిధ కాలాలలోని చారిత్రక విషయాలను వివరించారు. చరిత్ర అధ్యయనం ఉత్తమ భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుందన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో అద్భుతమైన మ్యూజియం నిర్మాణమై మన ముంగిటకు రావడం అందరూ గర్వించాల్సిన విషయమన్నారు. అనంతరం అతిథులు, రచయితలను మ్యూజియం సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ సాంకేతిక సహాయకుడు మహేంద్రనాయుడు, గిరిధరరాయ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి


రాజకీయ నాయకులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత గ్రామాల్లో గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు నాయకులకు సూచించారు. శనివారం చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లోని సర్కిల్ కార్యాలయంలో నామాల గ్రామానికి చెందిన ఇరు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇరు పార్టీల నాయకులకు పలు సూచనలిచ్చారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. పోలీసుల హెచ్చరికలను పెడచెవిన పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవల్లో జోక్యం చేసుకోరాదన్నారు. అనంతరం పలువురు గ్రామస్తులను బైండోవర్ చేశారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజనేయులు, చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఐసీసీయూలో పని చేయని ఏసీలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఐసీసీయూలో గత నెల రోజులుగా ఏసీలు రిపేరీలో ఉన్నాయి. ఏసీల మరమ్మతు విషయాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సంబంధిత ఏపీఎంఎస్ఐడీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారి నుంచి ఎటువంటి స్పందన లేదు. వాస్తవంగా ఎన్నికలకు ముందుగానే ప్రభుత్వం జీజీహెచ్‌లో పునరుద్ధరణ పనులకు రూ.3.5 కోట్లు కేటాయించింది. కాగా పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అధికారులు మీనామేషాలు లెక్కిస్తున్నారు. నెల రోజుగా ఏసీలు పని చేయకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఉక్కపోత ఉండడంతో వార్డులో కిటికీలను తెరిచే పరిస్థితి నెలకొంది. కనీసం ఇప్పటికైనా ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు మేలుకుని చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

# నేడు స్వర నీరాజనం


సీహెచ్ రావుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: తొలిసారి అనంత వేదికగా 8 సాంస్కృతిక సంస్థలు ఒకే వేదికపై నిలిచి స్వర నీరాజనం పేరుతో అమర గాయకుడు ఘంటసాలకు ఘనంగా నివాళులర్పించనున్నారు. లలిత కళాపరిషత్తు వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ ఘంటసాల 101 పాటలతో స్వర నీరాజనం నిర్విరామంగా కొనసాగనుంది. ఈ నేపథ్యంలో 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్‌ను నిర్మిస్తున్న సినీ నిర్మాత, దర్శకులు సీహెచ్ రామారావు శనివారం సాయంత్రం అనంతకు విచ్చేశారు. నిర్వాహకులు అనంత ఘంటసాల రామయ్య, సీనియర్ గాయకుడు పాలసముద్రం నాగరాజు, కన్వీనర్ బాలమురళీకృష్ణ, పాత పాటల ప్రేమికుల సమూహం అధ్యక్షుడు ఓబుళదాసుతో పాటూ ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శక నిర్మాత రామారావు మాట్లాడారు. ఒకే గాయకుడు ఆలపించిన 101 పాటలను 12 గంటల పాటూ నిర్విరామంగా ఆలపించడం అరుదైన ఘట్టంగా సంగీత చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆచార్య సుధాకర బాబు, బృందా సుధాకర్, డాక్టర్ శ్యామసుందర శాస్త్రి, లక్ష్మి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఎంఆర్ఐ ఫిల్మ్‌ల పంపిణీలో జాప్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఎంఆర్ఐ ఫిల్మ్‌ల పంపిణీలో జాప్యం జరిగింది. శనివారం ఎంఆర్ఐ స్కాన్‌లో ప్రింటర్ జామ్ అయ్యింది. కాగా ఫిల్మ్‌లను పూర్తి స్థాయిలో సరఫరా చేయలేదు. దీంతో స్కాన్ చేయించుకున్న వారు నిరాశతో వెనుదిరిగారు. ఆదివారం నుంచి యథావిధిగా ఫిల్మ్‌లు అందిస్తామని స్కాన్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు.

### రేపు హజ్ యాత్ర ప్రారంభం

అనంతపురం కల్చరల్: సోమవారం ఉదయం జిల్లా నుంచి హజ్‌యాత్ర ప్రారంభమవుతుందని హాజీల ఖాదిమ్ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని పీటీసీకి ఎదురుగా ఉన్న చాందినీ మసీదులో ప్రత్యేక దువా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజీలందరూ హాజరుకావాలన్నారు. మహిళలకు పర్దా సౌకర్యంతో పాటూ హాజీలందరికీ అల్పాహార వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దువా అనంతరం బెంగళూరుకు బయల్దేరాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9440983090 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# అనంత ఆణిముత్యం 'నీలం'


నీలం సంజీవరెడ్డి (ఫైల్)

**సందర్భం: నేడు నీలం సంజీవరెడ్డి జయంతి**

అనంతపురం కల్చరల్: 'అనంత' కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసిన అతి కొద్దిమందిలో నీలం సంజీవరెడ్డి అగ్రగణ్యుడు. జాతీయ స్థాయిలోనైనా అనంతపురం పేరు చెప్పగానే ఠక్కున గుర్తుచ్చే వ్యక్తులు ఇద్దరే. ఆధ్యాత్మికంగా భగవాన్ సత్యసాయిబాబా, రాజకీయంగా నీలం సంజీవరెడ్డి. శాసన సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, లోక్‌సభ స్పీకర్‌గా అన్నిటికీ మించి దేశ ప్రథమ పౌరుడిగా అనితరసాధ్యమైన బాధ్యతలను నిర్వర్తించిన నీలం సంజీవరెడ్డి అనంత పేరు ప్రఖ్యాతలను ఢిల్లీలో మార్మోగించారు.

**జీవితం ఆద్యంతం ఆసక్తికరం..**

గార్లదిన్నె మండలం ఇల్లూరులో మే 19, 1913లో నీలం సంజీవరెడ్డి జన్మించారు. 1931లో జాతీయోద్యమంలో ప్రవేశించారు. 1946లో మద్రాసు అసెంబ్లీ సభ్యుడయ్యారు. 1947లోభారత రాజ్యాంగ సభ్యుడిగా ఎన్నికయ్యారు. చాలామంది రాజ్యాంగ రచన అంటే అంబేడ్కర్ ఒకరే అనుకుంటారు. రాజ్యాంగ నిర్మాణంలో సంజీవరెడ్డి కూడా కీలక పాత్ర వహించారని కొందరికే తెలుసు. మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో 1949 నుంచి 1952 వరకూ మద్యపాన నిషేధ శాఖ మంత్రిగా పని చేశారు. 1952లో రాజ్యసభ సభ్యులయ్యారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రకాశం మంత్రి వర్గంలో 1955లో బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలోనూ ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. 1959లో భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షులయ్యారు. 1962లో తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు. కనుకనే బస్సుల జాతీయాకరణ అంశం న్యాయస్థానం పరిశీలనకు తలొగ్గి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో ఉక్కుగనుల శాఖమంత్రిగా, ఇందిరాగాంధి మంత్రి వర్గంలో రవాణా, విమానయాన శాఖమంత్రిగా పనిచేశారు. హిందూపురం నుంచి లోక్‌సభ సభ్యుడై 1967–69 మధ్య స్పీకర్‌గా ఉన్నారు. 1977లో నంద్యాల నుండి లోకసభకు ఎన్నికై 1977 మార్చి నుంచి జూలై వరకూ స్పీకర్‌గా పని చేశారు. అదే ఏడాది జూలై 25 నుంచి 1982 జూలై 24 వరకూ భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు.

### గుండె ఆపరేషన్లకు ఆర్థికసాయం


బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి ఔదార్యం చాటుకున్నారు. వంశపారంపర్యంగా వస్తున్న జబ్బు జీవన్మరణ సమస్యగా మారి విలవిలలాడుతున్న కుటుంబానికి ఏకంగా రూ.8 లక్షల సాయం అందించి పెద్ద దిక్కుగా మారారు. వివరాలు.. నగరంలోని హమాలీ కాలనీలో నివసిస్తున్న నరసింహులు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అతడికి ఆరుగురు సంతానం కాగా.. ఐదుగురు పిల్లలు గుండె సమస్యలతో బాధపడుతున్నారు. జనటిక్ సమస్య వల్ల అరుదుగా ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటాయని.. ఆపరేషన్లు చేస్తే తప్ప జీవించడం కష్టమని వైద్యులు తేల్చేశారు. ఒక్కో ఆపరేషన్‌కు కనీసం రూ.1.50 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి వారిని ఆదుకోవడానికి ముందుకొచ్చారు. ఆపరేషన్లకు అయ్యే మొత్తం రూ. 7.50 లక్షలను తక్షణ సాయంగా శనివారం అందజేశారు. అంతేకాకుండా రవాణా సౌకర్యం, పిల్లల మందులు, నిత్యావసరాల కోసం మరో రూ.50 వేల నగదు అందజేశారు.